సాక్షి నిర్మల్

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



దివ్యాంగుల 'వికాసం' 8లో▸

ఉట్నూర్‌లో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వికాసం పాఠశాలలో 142 మందికి విద్యా బోధన చేస్తున్నారు. అంధ విద్యార్థులకు ప్రత్యేక వసతులు కల్పించారు.

చెడు వ్యసనాలు వద్దన్నందుకు చంపేశాడు



తన జల్సాలకు అడ్డు పడుతున్న భార్యను కడతేర్చాలనుకున్నాడు. 30 ఏళ్ల వైవాహిక బంధాన్ని మర్చిపోయాడు. పక్కా ప్రణాళికతో భార్యను హతమార్చాడు. ఈ ఘటన మామడ మండలం దిమ్మతుర్తిలో శనివారం జరిగింది. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
28.4 /17.7

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. రాత్రి చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. వేకువ జామున పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వేడుకలు ఇళ్లలోనే జరుపుకోవాలి

• ఎస్పీప్రవీణ్‌కుమార్



ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్ టౌన్: న్యూ ఇయర్ వేడుకలను ఇళ్లలోనే జరుపుకోవాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. 31 రాత్రి విస్తృతంగా తనిఖీలు చేస్తామని నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలతోపాటు, అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేయడంతోపాటు, కేసులు నమోదు చేస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. వీధుల్లోకి రావద్దన్నారు. రాత్రి 10 గంటల తర్వాత హోటళ్లకు, ఇతర షాపులకు అనుమతి లేదని తెలిపారు.

'పది' పరీక్షలకు సన్నద్ధం కావాలి

• డీఈవో రవీందర్‌రెడ్డి



విద్యార్థినితో చదివిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

మామడ: పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను శనివారం సందర్శించారు. పరీక్షలకు సన్నద్ధతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రత్యేక తరగతులకు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే అంశాలను అవగాహన చేసుకుని, అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. వందశాతం ఉత్తీర్ణతతో జిల్లాను ఈ ఏడాది కూడా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని తెలిపారు. లక్ష్య కార్యక్రమం అమలు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధనోపకరణాలు వినియోగించాలని ఆదేశించారు. విద్యార్థుల పఠన, లేఖన నైపుణ్యాలను పరిశీలించారు. ఉన్నతి కార్యక్రమం అమలు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం మెనూ పాటించాలని నిర్వాహకులకు సూచించారు. డీఈవో వెంట హెచ్‌ఎం అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అనధికార వీడీసీపై ఎస్పీకి ఫిర్యాదు

ఖానాపూర్: ఖానాపూర్‌లో అనధికార వీడీసీపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై తాను 9 మంది కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాసం పెట్టినట్లు తెలిపారు. ఈ విషయమై కోర్టు స్టే ఉండడంతో ఏడాది కాలంగా అవిశ్వాసం ప్రక్రియ ఆగిపోయిందన్నారు. గత నెలలో మళ్లీ అవిశ్వాసం తీర్మానం ప్రవేశ పెట్టగా జనవరి 5న దీనిపై నిరూపణ కోసం ఉన్నతాధికారులు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే, ఖానాపూర్‌లోని అనధికార వీడీసీకి చెందిన సుమారు 20 మంది సభ్యులు అవిశ్వాసం నోటీసు వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఊళ్లో తిరగనివ్వమని బెదిరిస్తున్నారని తెలిపారు. 5న అవిశ్వాసం జరిగితే దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అడ్డుకునేలా వ్యవహరిస్తున్న అనధికార వీడీసీలపై చర్య తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట నాయకులు పరిమి సురేశ్, జన్నారపు శంకర్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా పెంబి మండలంలో అస్పిరేషనల్ బ్లాక్ ఫెల్లోస్ ఫర్ యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కోసం కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు కలిగి, ఆసక్తి గల అభ్యర్థులు డిసెంబర్ 31 నుండి జనవరి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు add.coll.lb.nml@gmail.com మెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7337340829, 9052409418 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అలా.. ముగిసె..



ఏడాదిలో ఎన్నెన్నో..

- జిల్లాలో ప్రారంభమైన వైద్యవిద్య
- సమీకృత కలెక్టరేట్ నుంచి పాలన
- మాస్టర్‌ప్లాన్, ఇథనాల్‌పై రచ్చరచ్చ
- ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన
- ఏడాదిలో జిల్లాకు ముగ్గురు కలెక్టర్లు

నిర్మల్: జిల్లా చరిత్రలో 2023 మర్చిపోలేని ఎన్నో అనుభూతులను, సంఘటనలను మిగిల్చింది. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక, ఆధ్యాత్మిక, రాజకీయ, పాలన.. ఇలా అన్నిరంగాల్లో మార్పు తెచ్చింది. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే ప్రయత్నం చేసింది. జిల్లాకేంద్రంలో మెడికల్‌కాలేజీ ప్రారంభ మైంది. సమీకృత కలెక్టరేట్ నుంచి పాలన మొదలైంది. కాగా, పోటెత్తిన వరద మళ్లీ కడెం ప్రాజెక్టును దడదడలాడించింది. సిరాల ప్రాజెక్టును తెంచింది. జిల్లాకేంద్రాన్నీ ముంచింది. నిర్మల్ మాస్టర్‌ప్లాన్‌లొల్లి, దిలావర్‌పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీపై ఆందోళన మాత్రం రాష్ట్రస్థాయిలో చర్చగా మార్చాయి. అలాగే ముగ్గురు కలెక్టర్ల పాలననూ చూపింది. పన్నెండు నెలల్లో ఇలాంటివెన్నో జిల్లా చవిచూసింది.

ఏడాదిలో ముగ్గురు కలెక్టర్లు..



ముషరఫ్‌అలీ, కర్ణాటి వరుణ్‌రెడ్డి, ఆశిష్ సంగ్వాన్

ఈ ఏడాది జిల్లాలో ఓ అరుదైన విషయం చోటుచేసుకుంది. ఒకే ఏడాదిలో ముగ్గురు కలెక్టర్లు మారారు. 2020, ఫిబ్రవరి 2న తొలిసారి కలెక్టర్‌గా నిర్మల్ వచ్చిన ముషరఫ్‌అలీ జిల్లాలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఈఏడాది జనవరి 31 వరకు కొనసాగారు. అదేరోజు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన కూడా తొలిసారి కలెక్టర్‌గా వచ్చి తొమ్మిదినెలలు మాత్రమే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ అక్టోబర్ 11న వరుణ్‌రెడ్డిని తప్పించింది. తన స్థానంలో అక్టోబర్ 13న ఆశిష్ సంగ్వాన్‌ను కలెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం ఆయన జిల్లా పాలనాధికారిగా కొనసాగుతున్నారు.

మాస్టర్‌ప్లాన్ లొల్లి..



మహేశ్వర్‌రెడ్డితో దీక్ష విరమింపజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

జిల్లాకేంద్రంలో మున్సిపల్ మాస్టర్‌ప్లాన్‌పై వ్యతిరేకత ఈ ఏడాది ముదిరింది. మాస్టర్‌ప్లాన్ రద్దు చేశామని చెబుతూనే దొంగతనంగా జీవో తీసుకువచ్చి అమలు చేస్తున్నారంటూ పట్టణ శివారు రైతులు, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. మాస్టర్‌ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేయాలంటూ బీజేపీ నేతగా ఉన్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగస్టులో చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బీజేపీ రాష్ట్రనేతలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, వివేక్‌వెంకటస్వామి తదితరులు మద్దతు తెలిపారు. ఆరోగ్యం క్షీణించిన ఏలేటిని బలవంతంగా జిల్లా ఆస్పత్రికి తరలించగా, అక్కడికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వచ్చి దీక్ష విరమింపజేశారు. మరోవైపు జిల్లాకేంద్రంలోని రైతులూ రోడ్డెక్కారు. మాస్టర్‌ప్లాన్ పూర్తిగా రద్దు చేయాలంటూ నిరాహారదీక్ష చేశారు. ఈ ఆందోళనే నిర్మల్ నియోజకవర్గ రాజకీయాన్ని మార్చింది.

మెడికల్ కాలేజీ ప్రారంభం..

జిల్లా పదేళ్లుగా ఎదురుచూస్తున్న మెడికల్ కాలేజీ కల ఈఏడాది నెరవేరింది. ఎట్టకేలకు జిల్లాకేంద్రంలో వైద్యవిద్య ఆరంభమైంది. సెప్టెంబర్ 15న అప్పటి సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రారంభించారు. మొదటి బ్యాచ్ తరగతులు ప్రారంభమయ్యాయి.

ఒకేరోజు మూడు..

జిల్లాలో అక్టోబర్ 4న ఒకేరోజు మూడు పనులు ప్రారంభమయ్యాయి. ఏళ్లుగా పనులు పూర్తికాక పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీనర్సింహస్వామి(ప్యాకేజీ–27) ఎత్తిపోతల పథకం ప్రారంభమైంది. అప్పటి మంత్రి కేటీఆర్ ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో నుంచి నీటిని ఎత్తిపోసే ప్యాకేజీ–27 పథకాన్ని ప్రారంభించారు. అదేరోజు సోన్ మండలం పాక్‌పట్ల వద్ద ప్రియూనిక్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి, నిర్మల్ జిల్లాకేంద్రంలో సమీకృత మార్కెట్ సముదాయానికి శంకుస్థాపన చేశారు. కానీ ప్యాకేజీ–27 ఆ ఒక్కరోజే పనిచేసింది.

'సమీకృత' పాలన..

జిల్లాకేంద్రంలో సమీకృత కలెక్టరేట్ నిర్మాణం ఈ ఏడాదే పూర్తయింది. జూన్ 4న అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా నిర్మల్ వచ్చి, అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అప్పుడున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అప్పటి నుంచి కొత్త కలెక్టరేట్ నుంచే జిల్లా పాలన సాగుతోంది. కానీ జిల్లావాసులంతా కలెక్టరేట్ దూరమైందన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

'ఇథనాల్'పై ఆందోళన..



ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ ఆందోళన

ఈఏడాది జిల్లాకు ఓ పెద్ద పరిశ్రమగా ఇథనాల్ ఫ్యాక్టరీ వచ్చింది. దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య ఏర్పాటుచేసిన ఈ ఫ్యాక్టరీపై ఆందోళన మొదలైంది. తమ పంట భూములను ఫ్యాక్టరీ నాశనం చేస్తుందంటూ స్థానిక రైతులు, మండలవాసులు గత కొన్నినెలలుగా రాస్తారోకోలు, ఆందోళనలతో తమ వ్యతిరేకతను తెలియజేస్తున్నారు.



ఎవరెస్ట్ బేస్ క్యాంపుపై ముక్క సాయిప్రసాద్(ఫైల్)



మరికొన్ని ఘటనలు..

- మే 6న జిల్లా నుంచి తొలిసారి నిర్మల్‌కు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ ముక్క సాయిప్రసాద్ ఏకంగా ఎవరెస్టు బేస్‌క్యాంప్ ఎక్కారు.
- మేలోనే చదువులతల్లి కొలువైన జిల్లా తొలిసారి రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. పదోతరగతి ఫలితాల్లో నిర్మల్ స్టేట్ ఫస్ట్‌గా నిలువడం విశేషం.
- ఆగస్టులో బాసర రైల్వేలైన్‌కు శుభవార్త వచ్చింది. హైదరాబాద్–షిర్డీ మార్గాన్ని డబుల్‌లైన్ చేసేందుకు కేంద్రం నిధులు మంజూరు చేసింది.
- సెప్టెంబర్‌లో నిర్మల్ ప్రజల దశాబ్దాల కలకు ఓ రూపం వచ్చే దిశగా అడుగుపడింది. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదిలాబాద్ నుంచి నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, నిజాంపేట్, సంగారెడ్డిల మీదుగా పటాన్‌చెరు వరకు రూ.5,706 కోట్లతో లైన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు.
- సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పొన్కల్, బీరవెల్లిలను కొత్తమండలాలుగా ప్రకటించారు.
- ఢిల్లీలో నిర్వహించిన 'మిస్ క్వీన్ ఆఫ్ ది వరల్డ్ ఇండియా–2023' పోటీ ల్లో జిల్లాకేంద్రానికి చెందిన నిషిత తిరునగరి ఒక్కమార్కు తేడాలో రన్నరప్‌గా నిలిచింది.
- రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇచ్చిన మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి.
- డిసెంబర్ 15న అడిషనల్ కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్ నియమితులయ్యారు.

సదరం షెడ్యూల్ ఖరారు

- జనవరి స్లాట్ బుకింగ్ తేదీలు విడుదల
- ఆర్థో, విజువల్, హియరింగ్, బుద్ధిమాంద్యత పరీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగులు నిర్వహించే సదరం క్యాంప్ తేదీలను అధికారులు శనివారం విడుదల చేశారు. మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ ద్వారా కేటాయించిన నిర్ణీత తేదీల్లో పరీక్షలు చేయించుకుని సదరం సర్టిఫికెట్ పొందవచ్చు. జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో పలువురు రెన్యూవల్ కావాల్సి ఉండగా, మరి కొందరు కొత్తవారు సైతం పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది.

స్లాట్ విధానం ద్వారా..

సదరం పరీక్షలకు ప్రభుత్వం రెండేళ్లుగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తోంది. పరీక్షలు చేయించుకునేవారు ఆధార్ కార్డుతో మీసేవ కేంద్రానికి వెళ్లాలి. వేలిముద్రలు తీసుకుని స్లాట్ బుక్ చేస్తారు. శిబిరంలో నిర్వహించే తేదీలు, స్థలం అందులో నమోదై ఉంటాయి. ప్రస్తుతం జనవరి స్లాట్ బుకింగ్ తేదీలను డీఆర్డీవో ప్రకటించారు.

వీరు రావొద్దు..

సదరం క్యాంపునకు మోకాళ్ల నొప్పులు, ఒంటి నొప్పులు, వృద్ధాప్యంతో బాధపడుతున్నవారు, కాళ్లు, చేతులు విరిగి రాడ్లు వేసుకున్న వారు హాజరు కాకూడదు. గుండె, మూత్రపిండాలు, లివర్, కేన్సర్, రొమ్ము కేన్సర్, బ్లడ్ కేన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవద్దని అధికారులు సూచించారు.

జనవరి నెల వివరాలు

అర్థోపెడిక్ : జనవరి 4, 24 తేదీల్లో పరీక్షలు చేయనున్నారు.
చెవిటి, మూగ: జనవరి 18, 30
బుద్ధిమాంద్యత : జనవరి 12 తేదీలలో నిర్వహిస్తారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం



రాజీపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి కర్ణకుమార్

నిర్మల్ టౌన్: కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, సెషన్స్‌జడ్జి అజేశ్‌కుమార్, సివిల్ జడ్జి అజయ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టులో జాతీయ లోక్ అదా లత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యా యమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లలో క్రిమినల్, సివిల్, భూతగాదాలు, రోడ్డు ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదాలు, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని వివరించారు. శనివరాం నిర్మల్ కోర్టులో మూడు, భైంసా, ఖానాపూర్ కోర్టుల్లో ఒక్కో బెంచ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం ఒక్కరోజే జిల్లా మూడు సివిల్ కేసులు, బ్యాంకులకు సంబంధించిన 27 కేసులు, 3,415 క్రిమినల్ కేసులు పరిష్కరించినట్లు వివరించారు. బ్యాంకులకు సంబంధించిన బకాయిలు జిల్లా మొత్తం రూ.13,78,320, నిర్మల్ కోర్టులో రూ.3,67,000 వసూలు చేసినట్లు తెలిపారు.

సీసీఐ వైపు రైతుల చూపు



భైంసా జిన్నింగ్ మిల్లులో పత్తి

- ప్రైవేటులో తగ్గుతున్న పత్తి ధర
- క్వింటాల్‌కు రూ.6,500 నుంచి రూ.6,800 చెల్లింపు
- సీసీఐలో మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020

భైంసా: జిల్లాలో పత్తి రైతులు సీసీఐ వైపు చూస్తున్నారు. రోజురోజుకు ప్రైవేటులో పత్తి ధర పడిపోతోంది. వారం రోజులుగా జిల్లాలో క్వింటాల్ పత్తి ప్రైవేటులో రూ.6 వేల నుంచి రూ.6,800 వరకు పలుకుతోంది. మద్దతు ధరకన్నా రూ.200 పైచిలుకు తక్కువకు వ్యాపాలు చెల్లిస్తున్నారు. గతేడాది క్వింటాల్‌కు ప్రైవేటు వ్యాపారులు రూ.7,600 నుంచి రూ.7,700 వరకు చెల్లించారు. ఈయేడు ధరలు అంతగా లేవు. ఆశించినస్థాయిలో పంట దిగుబడి రాకపోగా, అంతర్జాతీయ మార్కెట్‌లో దూదికి ధరలేదని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో రైతులు సీసీఐ మేలని భావిస్తున్నారు. ఏఈవోల వద్ద నమోదు చేయించి నేరుగా సీసీఐ కేంద్రాలకు వెళ్తున్నారు.

సీసీఐ కేంద్రాల వైపు..

ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధరకన్నా తక్కువకు పత్తి కొనుగోలు చేస్తుండడంతో సీసీఐ రంగంలోకి దిగింది. జిల్లాలో నాలుగు చోట్ల పత్తికొనుగోలు చేస్తోంది. భైంసాలో 12 జిన్నింగు మిల్లుల్లో, కుభీర్, నిర్మల్‌లో రెండు మిల్లుల చొప్పున, సారంగాపూర్ ఒక మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోంది. 17 కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 5,506 మంది రైతుల నుంచి 1,04,336 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసింది. ఇక, ప్రైవేటు జిన్నింగు యజమానులు 4,092 మంది రైతుల నుంచి 1,06384 క్వింటాళ్ల పత్తిని కొనుగోలుచేశారు. ప్రైవేటుగా ధర లేకపోవడం, సీసీఐ మద్దతు ధర రూ.7,020 చెల్లిస్తోంది. తేమశాతం పెరిగితే ధరలో కొంత తగ్గుతుంది. మొత్తంగా ప్రైవేటుకన్నా సీసీఐలోనే రైతులకు మద్దతు ధర లభిస్తుండడంతో రైతులు అటువైపే మొగ్గు చూపుతున్నారు.

బయోమెట్రిక్‌తో ఇబ్బంది..

భైంసా, నిర్మల్, సారంగాపూర్, కుభీర్ మార్కెట్ యార్డుల్లో సీసీఐ రైతుల ఆధార్, బయోమెట్రిక్ విధానంలో పత్తి కొనుగోలు చేస్తోంది. ఆన్‌లైన్‌లో పత్తి వివరాలు ఉంటే తేమశాతం పరిశీలించి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో దళారుల ప్రమేయం ఉండడం లేదు. అయితే కొంత మంది రైతులు బయోమెట్రిక్‌లో ఓటీపీ రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఓటీపీ రానివారు తిరిగి ప్రైవేటు వ్యాపారులకే పత్తిని విక్రయిస్తున్నారు. చాలా మంది రైతుల వేలిముద్రలు రాకపోవడం సమస్యగా మారింది.ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ లేకపోవడంతో ఓటీపీ రావడం లేదని అధికారు చెబుతున్నారు.

తగ్గిన దిగుబడి..

ఈయేడు పత్తి పంట దిగుబడి తగ్గింది. భారీ వర్షాలతో పత్తిపంట ఎరుపు రంగుకుమారింది. ఎకరానికి పది నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చేది. ఈయేడు నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడంలేదు. మరోవైపు ధర కూడా తగ్గిపోయింది. రెండేళ్ల క్రితం రూ.10 వేలకుపైగా ధర చెల్లించారు. ఈసారి కూడా దిగుబడి తగ్గినందున ధర పెరుగుతుందని భావించారు. కానీ నిరాశే మిగిలింది.

సీసీఐ కొనుగోలు చేసిన పత్తి వివరాలు (క్వింటాళ్లలో..)

భైంసా	2,801	60,094
నిర్మల్	1,392	24.088
సారంగాపూర్	1,048	15,693
కుభీర్	265	4,192
ప్రైవేటులో	4,092	1,06,384

మద్దతు ధరకు విక్రయించాలి..

ప్రైవేటుగా పత్తి ధర తగ్గిందని రైతులు ఆందోళన చెందొద్దు. సీసీఐ కేంద్రాలకు దిగుబడి తీసుకురావాలి. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.7,020 ధర ప్రకటించింది. సీసీఐ కేంద్రాల్లో 8 నుంచి 12 శాతంలోపు తేమ ఉన్న పత్తికి మద్దతు ధర చెల్లిస్తున్నాం. జిల్లాలో 17 జిన్నింగు మిల్లుల్లో సీసీఐ కొనుగోలు చేస్తుంది.

– అశ్ఫక్‌హైమద్, మార్కెట్ ఏడీఎం

అంతా అవినీతే

- నిధులన్నీ దుర్వినియోగం చేశారు..
- లెక్కలు చెప్పకుండా తప్పించుకుంటున్నారు
- 'మున్సిపల్'పై కౌన్సిలర్ల ఆరోపణలు
- వాడీవేడిగా సాగిన సమావేశం
- పాలకవర్గంపై స్వపక్ష, విపక్ష నిరసన



లెక్కలను చూపిస్తున్న మహిళా కౌన్సిలర్లు

నిర్మల్: నిర్మల్ మున్సిపాలిటీ పూర్తిగా అవినీతిమయమైందని, పనుల పేరు చెప్పి కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని కౌన్సిలర్లు ఆరోపణలు చేశారు. సమావేశంలో లెక్కలు చెప్పమంటే తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బల్దియా సమావేశం వాడీవేడిగా సాగింది. కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు పాలకవర్గం సరైన సమాధానం చెప్పకపోవడంతో వారంతా చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. బీజేపీ నేత, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ మాట్లాడుతూ పట్టణ సుందరీకరణ, బతుకమ్మ ఉత్సవం, కేటీఆర్ పర్యటనల పేరిట కోట్ల రూపాయలను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బోగస్ హామీలు, లెక్కలతో తప్పుదోవ పట్టించారన్నారు. నాలుగేళ్లలో నిర్మల్ మున్సిపాలిటీలో ఉన్నంత అవినీతి రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. దీనిపై తమ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ద్వారా విజిలెన్స్ విచారణ చేయిస్తామన్నారు. కౌన్సిలర్ ఉమారాణి మాట్లాడుతూ సమావేశంలో ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత బతుకమ్మ సంబురాల పేరిట రూ.7 లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు మున్సిపల్ బడ్జెట్‌లో ఆమోదించడం ఏంటని ప్రశ్నించారు. పండుగల పేరిట చేసిన ఖర్చునూ ముందస్తుగా ప్రస్తావించకుండా, కౌన్సిల్ ఆమోదించకుండా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. మున్సిపల్ పాలకవర్గం తీరుపై ప్రతిపక్ష బీజేపీతోపాటు, స్వపక్ష బీఆర్‌ఎస్ కౌన్సిలర్లూ మండిపడటం గమనార్హం.



'ప్రజాపాలన'కు దరఖాస్తుల వెల్లువ

జిల్లాలో మూడో రోజు ప్రజాపాలన సభలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఐదు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు బారులు తీరారు. అధికారులు సభల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసి దరఖాస్తులు స్వీకరించారు.

- వివరాలు 9లో▸

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి: కెరమెరి మండలంలోని బారె మోడి గ్రామానికి చెందిన మొహర్లే బడిరాం ఇంటి ఆ వరణలో ఈ నెల 29న తనిఖీలు నిర్వహించి రూ.10వేల విలువైన 1.320 కిలోల పచ్చి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ని ర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో కెరమెరి ఎస్సై విజేయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఈజ్‌గాం రోడ్డు (ఆర్ఆర్‌ఓ కాలనీ) వద్ద గల పెట్రోల్ పంపు సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... పట్టణ సీఐ బుద్దే స్వామి, ఎస్సై ఎంబడి శ్రీకాంత్‌లు పెట్రోలింగ్‌లో భాగంగా ఆర్ఆర్‌ఓ కాలనీ వైపు వస్తుండగా ద్విచక్ర వాహనంపై కూర్చొని ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా ఓ ప్యాకెట్‌లో 40 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన యువకుడు కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం బెంగాలీ క్యాంపు-3కు చెందిన మిథున్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ధాన్యం కుప్ప దగ్ధం



దగ్ధమైన ధాన్యం కుప్ప

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన రైతు ఎస్. సంతరాంకు చెందిన ధాన్యం కుప్ప విద్యుత్ ప్రమాదంలో శనివారం దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఎకరం పొలంలోని ధాన్యం కుప్పగా పోశాడు. ఈ క్రమంలో వరి గడ్డి సమీపంలోని విద్యుత్ తీగలపై పడడంతో మంటలు చెలరేగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ధా న్యంతో పాటు గడ్డి పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో సంతరాం చేతికి స్వల్ప గా యాలయ్యాయి. కేశార్ డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రూ.50వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని సదరు రైతు వేడుకుంటున్నాడు.

యువకుడి మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సంపత్ (25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.... ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సంపత్ ఈ నెల 26వ తేదీన రాత్రి అదే గ్రామంలోని కిరాణ షాపుకు కోడిగుడ్లు కొనేందుకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వీరబోయిన సతీశ్, పంది మహేశ్, అలుగునూరి అరుణ్ అనే వ్యక్తులు షాపు వద్దే ఉన్నారు. వాళ్లు సంపత్‌తో మాట్లాడుతుండగా సతీష్ సంపత్‌ను అవురా అని అన్నాడు. కులం తక్కువ వాడివి అలా అంటావా అని సతీష్, మహేష్, అరుణ్ సంపత్‌ను కడుపుపై గుద్దారు. దీంతో ఇంటికి వెళ్లిన సంపత్‌కు నొప్పి ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే మళ్లీ సంపత్‌కు శుక్రవారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో చెన్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నతుట్ల సీఐ వివరించారు.

దివ్యాంగుల 'వికాసం'

ఉట్నూర్‌రూరల్: సమాజంలోని ప్రతీఒక్కరిలో ఏదో ఒక సమాజ సేవ చేయాలనే ఆతృత ఇమిడి ఉంటుంది. సమాజ సేవ చేయదానికి ఒక్కొక్కరూ ఒక్కో విధంగా రాణిస్తుంటారు.. అదే మార్గంలో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సైతం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన దివ్యాంగ విద్యార్థులకు విద్యను అందించాలనే ఉద్దేశంతో ఓ పాఠశాలను ఏర్పాటు చేశాడు. భోజనం, వసతి, విద్యను అందిస్తున్నారు. ఆ విద్యా సంస్థ పేరే.. వికాసం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఈ పాఠశాలలో పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా దివ్యాంగ విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు.

- ప్రత్యేక సదుపాయాలతో వసతి
- చదువుల్లో రాణించేలా బోధన
- క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న వైనం
- అంధ విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు



ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని వికాసం పాఠశాల



దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు



క్రీడల్లో రాణించిన వారిని అభినందిస్తున్న పీవో

పీవో కర్ణన్ ప్రత్యేక చొరవ...

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో అప్పటి ఐటీడీఏ పీవో ఆర్వీ కర్ణన్ ప్రత్యేక చొరవతో దివ్యాంగుల కోసం వికాసం పాఠశాలను ఏర్పాటు చేయించాడు. నాలుగు రకాల వైకల్యాలు కలిగిన మొత్తం 142మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఈ పాఠశాలను 2015 నవంబర్‌లో హైకోర్టు జడ్జి దిలీప్ జీ బోస్లే చేతుల మీదుగా ప్రారంభించారు.

వైకల్యం గల వారికి ఆశ్రయం..

వికాసం ప్రత్యేక బాలల బడిలో 1 నుంచి 8వ తరగతి వరకు చదువుకుంటున్నారు. ఇందులో బుద్ధి మాంద్యం గల విద్యార్థులు 37మంది. బధిరులు (చెవిటి, మూగ) 61, అంధులు 29, అంగవైకల్యం కలిగిన వారు 15 మంది ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు.

పాఠశాల ప్రత్యేకత...

ఈ వికాసం పాఠశాలలో దివ్యాంగుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆర్వీ కర్ణన్ ప్రత్యేక బాలల బడిని ఏర్పాటు చేయించారు. ఈ పాఠశాలలో ప్రత్యేకంగా దివ్యాంగులైన పిల్లల కోసం హాస్టల్ వసతి, ప్రత్యేకమైన ఉపాధ్యాయులతో బోధన, మంచి భోజనం, మినరల్ వాటర్, స్నాక్స్ అందిస్తున్నారు. పిల్లలకు ప్రతి నెల డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. పాఠశాలలో పిల్లల కోసం ఆట స్థలం, ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. ఈ పాఠశాలలో మొదట 1వ తరగతి నుంచి 5 వరకు నిర్వహించారు. ప్రతీ ఏడాది ఓ తరగతిని పెంచుతూ ప్రస్తుతం 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో అంధుల కోసం ప్రత్యేక డార్మెంటరీని ఏర్పాటు చేశారు. దీంతో అంధ విద్యార్థులు వారి పనులు వారే చేసుకుంటారు. అంధులు స్మార్ట్ కేన్ సాయంతో టాయిలెట్స్‌కి, తరగతి గదుల్లోకి వెళ్తుంటారు. వీరికి ప్రత్యేకంగా ర్యాంపులు సైతం ఏర్పాటు చేశారు.

క్రీడల్లోనూ ప్రతిభ...

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని మైదానంలో జరిగిన ఆటల పోటీల్లో రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారెం, జావిలింగ్‌త్రో పోటీల్లో అంధులు, మానసిక వికలాంగ విద్యార్థులు పాల్గొని 18 బహుమతులు గెలుపొందారు. 27న 6వ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ఆరుగురు విద్యార్థులు సత్తాచాటి బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. అలాగే సైన్స్‌పేర్ పోటీల్లో సైతం జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు.

ఇక్కడ చదువుకోవడం ఇష్టం..



వికాసం పాఠశాలలో ఉండి చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్న. ఇక్కడ చదువుకోవాలంటే చాలా ఇష్టం.. సార్లు బాగ చూసుకోవడంతో పాటు తమకు అర్థమయ్యే రీతిలో మమ్మల్ని చదివిపిస్తున్నారు. అంతేకాకుండా తమ పనులు తాము చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎవరి తోడు లేకున్నా మా పనులు మేము చేసుకుంటాం.

– టి.హన్మంతు, 7వ తరగతి, అంధ విద్యార్థి సిర్పూర్(యు)

ఇంటికి కూడా వెళ్లం..



ఇంటి కంటే ఇక్కడే మంచిగా అనిపిస్తది. అందరితో కలిసి చదువుకోవడం అన్ని పనులు చేసుకోవడం బాగుంటుంది. సార్లు తమకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించడం, మంచి భోజనం అందించడం, ఆటలు, పాటలు నేర్పించడం సంతోషాన్ని కలిగిస్తుంది. నేను కూడా బాగా చదువుకొని మంచి స్థాయికి ఎదుగుతా..

– బి.రంజిత్, 8వ తరగతి, ఉట్నూర్ కొత్తగూడ

పిల్లలు ఇష్టంగా నేర్చుకుంటున్నారు..



పాఠశాలలో ఉన్న విద్యార్థులంతా అంగ వైకల్యం కలిగిన వారే. వారికి చదువంటే చాలా ఇష్టం.. తాము సైగల ద్వారా వారికి విద్యాబోధన చేస్తాం.. మొదట్లో కాస్త కష్టమైన వారికి అర్థమయ్యే రీతిలో విద్యను అందిస్తుండడంతో వారు ఇష్టంగా చదువుకుంటున్నారు. ఆటపాటలు నేర్చుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వీరికి విద్యను అందించడం అదృష్టంగా భావిస్తున్న.

– పావని, ఉపాధ్యాయురాలు

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



దివ్యాంగ విద్యార్థులు కావడంతో వారికి అన్నివసతులు, భోజన సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందిస్తున్నాం. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పాఠశాల గురించి తెలుసుకున్న వారు ఇతర జిల్లాల నుంచి కూడా దివ్యాంగ విద్యార్థులను ఇక్కడ చేర్పిస్తున్నారు. చదువుతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ రాణిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయింది.

– రాథోడ్ వికాస్, వికాసం పాఠశాల, ప్రధానోపాధ్యాయుడు

ఖానాపూర్‌లో పట్టపగలు చోరీ



టవర్స్‌కాలనీలో క్లూటీం విచారణ

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలోని టవర్స్‌కాలనీలోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన వ్యాపారి చిటికేషి ఆశిష్ కుటుంబీకులు ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చే చూడగా ఇంట్లోని 14తులాల బంగారంతో పాటు రూ.40వేల నగదునుఎత్తుకెళ్లారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన గోలి ప్రతాప్ నివాసంలో 10 గ్రాముల వెండిని ఎత్తుకెళ్లారు. రాజీవ్‌నగర్ కాలనీలోని రాజేశ్వర్‌గౌడ్, ప్రకాష్‌ల నివాసాల్లో సైతం ఓ దొంగ ముసుగు వేసుకుని ఇళ్లల్లో చొరబడి చోరీకి యత్నించాడు. ఆయా నివాసాల్లో ఎలాంటి నగదు, బంగారం దొరకకపోవడంతో వెళ్లిపోయాడు. రాజీవ్‌నగర్ కాలనీలోని సీసీ ఫుటేజీలో ఒక నిందితుడికి సంబంధించిన చిత్రాల్ని పోలీసులు గుర్తించి విచారణ చేపట్టారు. ఈమేరకు సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో క్లూటీంలతో కలిసి అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

ఎడ్లబండిపై జంగుబాయి దర్శనానికి..



ఎడ్లబండిపై వెళ్తున్న ఆదివాసీ గిరిజనులు

నార్నూర్: ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం జంగుబాయి దర్శనానికి శనివారం మండలంలోని గుంజాల గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు ఎడ్లబండ్లపై బయలుదేరారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజాసామగ్రితో దాదాపు మహారాష్ట్ర సరిహద్దులోని జంగుబాయి పుణ్య క్షేత్రానికి కొందరు కాలినడకన వెళ్లారు. పుష్య మాసం ప్రారంభానికి ముందు ఏటా ఇక్కడ మొక్కులు తీర్చుకుంటామని గ్రామ పటేల్ తెలిపారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం

నర్సాపూర్(జి): మండల కేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రకృతి ఒడిలో వెలిసిన శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి (ఆది దంపతుల) కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వస్తి పుణ్యాహవాచనం, మూలవిరాట్ అభిషేకం, స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రధాన వీధుల గుండా ఊరేగించి ఆలయానికి తీసుకువెళ్లారు. అనంతరం పురోహితులు నరహరి శర్మ, రాజశేఖర్ శర్మ, జంగం గంగాప్రసాద్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. నర్సాపూర్ (జి) కి చెందిన గుజరాతి సోనియా-కిరణ్ బాబు దంపతులు స్వామి కల్యాణంతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

ఆది దంపతుల విగ్రహాలు

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఇంద్రవెల్లి: చేపల వేటకు వెళ్లి ఇంద్రవెల్లి మండలంలోని కొబ్బయ్‌గూడ గ్రామ సమీపంలోని చెరువులో ఈ నెల 26న గల్లంతైన వ్యక్తి గారుశే నాందేవ్(30) మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు. నాలుగు రోజులుగా గజఈతగాళ్ల సాయంతో గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. శనివారం ఉదయం చెరువులో నాందేవ్ మృతదేహం తేలి కనిపించింది. మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చేపలవేటకు తన భర్తను తీసుకెళ్లిన రమేష్, మారుతి, డిగంబర్‌లపై అనుమానం ఉందని, దర్యాప్తు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని మృత్యుడి భార్య సుమన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందడంతో అంజీ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. భార్య సుమన్‌బాయితో పాటు కూతురు ఉన్నట్లు తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై సునీల్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఇమ్రాన్‌ఖాన్ (ఫైల్)

కుంటాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. బంధువుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ఇమ్రాన్‌ఖాన్ (25) మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన వరుసకు మేనమామ అయిన ఖదీర్ వద్దే ఉంటూ చదువుకున్నాడు. ఇటీవల కుంటాలలో వెల్డింగ్ దుకాణం నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం మిత్రుడు వంశీతో కలిసి సారంగాపూర్ మండలం మలక్ చించోలిలోని విందు కార్యక్రమానికి వెళ్లాడు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఇమ్రాన్‌ఖాన్ తీవ్రంగా గాయపడగా వంశీకి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిర్మల్‌కు తరలించారు. ఇమ్రాన్‌ఖాన్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. కుటుంబీకులు సారంగపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అడిషనల్ డీఎంహెచ్‌వోకు సన్మానం



గజానన్‌ను సన్మానిస్తున్న సంఘ బాధ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అడిషనల్ డీఎంహెచ్‌వోగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన గజానన్‌ను తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సంఘం బాధ్యులు పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, అల్లాడి రఘురామారావు, బాధ్యులు మహేందర్, బ్రహ్మానంద్‌రెడ్డి, సిడాం వామన్‌రావు, రమణాచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా హామీ నెరవేర్చే తరుణం కోసం...

- వేచిచూస్తున్న గల్ఫ్ మృతుడి కుటుంబం
- భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీకి వినతి..
- ప్రజాపాలన కార్యక్రమంలో మరోమారు దరఖాస్తు



దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన మూడ లక్ష్మి



జోడోయాత్రలో రాహుల్‌ను కలిసిన లక్ష్మి

నిర్మల్‌ఖిల్లా: ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు మూడ లక్ష్మి. నిర్మల్‌రూరల్ మండలంలోని కొట్ల-కే గ్రామం. గల్ఫ్ కార్మికుడైన భర్తను పోగొట్టుకుంది. శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు అందించింది. గతేడాది నవంబర్ 6న కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా హైదరాబాద్ సమీపంలోని బాచుపల్లిలో తన పదినెలల పసిపాప సాత్వికతో కలిసి తన గోడును విన్నవించుకుంది. ఆ పసిపాపది మాట్లాడే వయసు కూడా కాదు. గల్ఫ్ మృతుడి భార్య దీనస్థితిని చూసి చలించిన రాహుల్ గాంధీ తనతో పాటు యాత్రలోని కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆ కుటుంబానికి సాయం అందేలా చూడాలని సూచించారు. నిర్మల్ జిల్లాలోని కొట్ల-కే గ్రామానికి చెందిన మూడ అశోక్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన అబుదాబి వెళ్లాడు. అక్కడ అనుకొని ఘటనలో మృతి చెందాడు. అయితే అతడికి అప్పటికే భార్య మూడ లక్ష్మితో పాటు ఆరేళ్లలోపు ఇద్దరు పిల్లలు, పది నెలల పసిపాప సాత్విక ఉంది. ఈ చిన్నారికి పుట్టుకతోనే అనారోగ్య సమస్య ఉండడంతో రాహుల్‌గాంధీని కలిసిన అనంతరం నాలుగు నెలలకే మృత్యుఒడికి చేరుకుంది.

సంవత్సరం దాటిపోతోంది.

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొలువుతీరింది. అనంతరం ఆరు గ్యారెంటీల అమలు నిమిత్తం ప్రస్తుతం ప్రజాపాలన కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం గల్ఫ్ మృతుల కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని వేడుకుంటోంది. తన భర్త అశోక్ గతేడాది జూలై 24న అబుదాబి దేశంలో మరణించడంతో తన కుటుంబ జీవనం కష్టతరంగా మారిందని వాపోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, తదితర నాయకుల హామీ మేరకు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవిస్తోంది. ఇదే అంశంపై శుక్రవారం నిర్మల్ రూరల్ మండలంలోని కొట్ల(కె) గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు సమర్పించింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గుడిహత్నూర్: కుటుంబ కలహాలతో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... జాయ్‌బాయే వెంకటి (51) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. కొన్నిరోజులుగా కుటుంబ కలహాలతో సరిగా వ్యవహరించడం లేదు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై ఇమ్రాన్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య, కొడుకు ఉండగా కూతురు వివాహమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఉపాధ్యాయుల డుమ్మాపై విచారణ



విచారణ చేపడుతున్న ఎంఈవో చంద్రకాంత్



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎలాంటి సమాచారం లేకుండా శుక్రవారం గైర్హాజరయ్యారు. దీంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో చంద్రకాంత్ శనివారం పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎం సురేశ్ రావు, సర్పంచ్ ముత్తగౌడ్, వీడీసీ సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టారు. సమాచారం లేకుండా గైర్హాజరైన ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేసి తమ పాఠశాలకు కొత్త ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు ఎంఈవోను కోరారు. ఈమేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఎంఈవో హామీ ఇచ్చారు. విచారణలో వీడీసీ చైర్మన్ నర్సారెడ్డి, విద్యా కమిటీ సభ్యులు సాయిప్రసాద్, అలీం, జావిద్, ముజాహిన్, గంగాధర్ ఉన్నారు.



సాగరకాలనీలో వర్షాకాలంలో వర్షపు నీటితో కందకం



మట్టిపోసి కబ్జా చేస్తున్న దృశ్యం



ప్రియదర్శినగర్‌లోని రోడ్ నంబర్ వన్‌లో..

నిర్మల్‌లో... కందకాలు కబ్జా

నిర్మల్ అంటేనే కబ్జాలకు కేరాఫ్.. అనే చందంగా రాష్ట్రస్థాయిలో చర్చ సాగుతోంది. నిండుకుండల్లాంటి చెరువులను చెరబట్టేందుకే తెగించారు. ఇక కందకాలు ముచ్చట చెప్పనక్కరలేదు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఆక్రమణలు చేస్తున్నారంటే ఎవరు పెద్దగా పట్టించుకోరు. కానీ నిర్మల్‌లో మాత్రం కళ్లముందే, పట్టపగలే యథేచ్ఛగా కబ్జాచేస్తున్నారు. జనావాసాల మధ్య ఉన్న కందకాలను మాయం చేస్తున్నారు. అధికారులు మాత్రం స్పందించడం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో నిర్మల్ చెరువులా మారుతోంది.

– సాక్షి ఫొటో గ్రాఫర్ నిర్మల్